بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

Summary of Friday Sermon Huzur-e-Anwar 03.06.2016 (Telugu)

గుర్తుంచుకోవలసిన మొదటి విషయమేమనగా ఇస్లాంను పాటించుటకు ప్రధమ విషయము ధర్మబద్ధత. కనుక ధర్మబద్ధతను దృష్టియందుంచుకొని ఉపవాసముల గురించి తమ ఉపవాసములను అల్లాహ్ తఆలా కొరకు స్వచ్ఛతతో పూర్తి చేయుమను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆదేశమును జ్ఞప్తియందుంచుకొనుము.

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 03.06.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

ఉపవాసములు ఇస్లాం ప్రాథమిక సూత్రములలో గలవు. కనుక వాటిని పూర్తి చేయుట అనివార్యము. కొన్ని చిన్న చిన్న ప్రశ్నలు ఉపవాసముల గురించి ఉత్పన్నమగును. సెహ్రీ గురించి, ఇఫ్తారీ గురించి అనారోగ్యము గురించి వివిధ ప్రశ్నలు గలవు. ఈ కాలములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను అల్లాహ్ తఆలా నిర్ణయాధికారి, న్యాయాధికారిగా చేసి పంపెను. ఇస్లాం బోధన ఆధారముగా ప్రతి విషయమును వారు పరిష్కరించవలసి యుండెను. ప్రతి సమస్యను వారు పరిష్కరించి చూపినారు. అందుకే మనము మన సమస్యల పరిష్కారము, విద్యను పెంచుకొనుటకు వారి వైపు చూడవలసిన అవసరమున్నది. ఇప్పుడు ఉపవాసముల గురించి కొన్ని ప్రశ్నల సమాధానములు లేదా ఉపవాసముల గురించి వారి అభిప్రాయము ఎలా యుండెనో ప్రస్తావింతును.

గుర్తుంచుకోవలసిన మొదటి విషయమేమనగా ఇస్లాంను పాటించుటకు ప్రధమ విషయము ధర్మబద్ధత. కనుక ధర్మబద్ధతను దృష్టియందుంచుకొని ఉపవాసముల గురించి తమ ఉపవాసములను అల్లాహ్ తఆలా కొరకు స్వచ్ఛతతో పూర్తి చేయుమను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆదేశమును జ్ఞప్తియందుంచుకొనుము.

ఉపవాసము బుధవారము వుండవలసి యుండెను, కాని మన వద్ద మొదటి ఉపవాసము గురువారము రోజున వుండబడెను. ఇప్పుడెలా అని ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారినొకరు ప్రశ్నించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు బదులిచ్చిరి. దీనికి బదులుగా రమజాన్ తరువాత ఒక ఉపవాసము యుండవలెను. వదిలిపెట్టబడిన ఉపవాసమును రమజాన్ తరువాత పూర్తి చేయగలరు.

ఇదే విధముగా సెహ్రీ విషయము గలదు. సెహ్రీ భుజించి ఉపవాసము యుండుట అనివార్యము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ మనకు ఇదే ఆదేశమిచ్చిరి. ఒక హదీసులో వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. సెహ్రీ భుజించుము, ఎందుకనగా సెహ్రీ భుజించి ఉపవాసముండుటలో శుభము గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ స్వయముగా దీనిని పాటించేవారు. సెహ్రీ భుజించుట అనివార్యమని జమాఅత్‌నకు కూడ చెప్పేవారు. ఇదే విధముగా ఖాదియాన్‌కు వచ్చే అతిథుల కొరకు ఎంతో ఆడంబరముగా తప్పక సెహ్రీ ఏర్పాటు చేసేవారు.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు ఇట్లు తెలిపిరి. అల్లాహ్ తఆలా يريد الله بكم اليسر ولا يريد بكم العسر- అనెను. అనగా మీరు విశ్వసించిన తరువాత కూడ మీరు కష్టములలో జీవించుటను మేము భరించలేము. అందుకే మేము ఉపవాసములను విధిగావించితిమి. తద్వారా మీ కష్టములు దూరమగునని అల్లాహ్ తఆలా తెలిపెను. ఈ విషయము విశ్వాసిని విశ్వాసిగా చేయును. మీ కొరకు సులభమును కోరును, కష్టమును కాదను విషయము ఎంతో గుర్తుంచుకోదగిన విషయము. ఉపవాసములో ఆకలితో యుండుట లేదా ధర్మము కొరకు ఏదేని త్యాగము చేయుట మానవునికి హానికరము కాక పూర్తిగా లాభదాయకమే. రమజాన్‌లో మానవుడు ఆకలితో యున్నాడని భావించు వ్యక్తి ఖుర్‌ఆన్‌ను తిరస్కరించువాడగును. ఎందుకనగా మీరు ఆకలితో యుండగా మీరు భుజించుటకు మేము రమజాన్‌ను ఆదేశించినామని అల్లాహ్ తఆలా తెలిపెను. అల్లాహ్ తఆలా

తినుపించునదే ఆహారమని తెలిసినది. వాస్తవ జీవితము దీనితోటే గలదు. ఇది కాక ఇతర ఆహారము, ఆహారము కాదు రాళ్లు. దానిని భుజించు వారు మరణింతురు. తన నోట్లో పెట్టుకునే ఒక్క బుక్క కూడ ఎవరి కొరకోనని విశ్వాసి గమనించవలెను. అది అల్లాహ్ తఆలా కొరకైనచో అది ఆహారమే. కాని మనసు కొరకు అయినచో అది ఆహారము కాదు.

కనుక అల్లాహ్ తఆలా ఆదేశమని సిహ్రీ భుజించినచో రుచికరమైనది భుజించినను అల్లాహ్ తఆలా కొరకు భుజించినట్లగును. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినట్లు ఇందులో శుభము గలదు. కాని కడుపు నింపుకోదలచినచో, రుచికరమైన ఆహారము భుజించదలచినచో ఆనందము పొంద దలచినచో అది మనసు కొరకు అగును.

ప్రయాణము, అనారోగ్యములో ఉపవాసము భావ్యము కాదు. హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఒక చోట ఇట్లనిరి. నాకిప్పటికి మంచిగా గుర్తున్నది. నేటి ఖిలాఫత్ బైఅత్ చేయనివారికి నాయకులుగా యున్న మిర్జా యాకూబ్ బేగ్ గారు ఒక సారి ప్రయాణము చేసి వచ్చిరి. అప్పుడు అసర్ సమయము. ఉపవాసము విడిచిపెట్టాలని హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బలవంతము చేసిరి. ప్రయాణములో ఉపవాసము భావ్యము కాదని పట్టుబట్టిరి. ఇదే విధముగా ఒక సారి రోగుల ప్రస్తావన రాగా ఇట్లనిరి. సెలవులతో లబ్ధి పొందవలెనని మా అభిప్రాయము. ధర్మము కఠినత్వమును కాక సైలభమును నేర్పును. రోగి, ప్రయాణికుడు ఉపవాసము యుండగలిగినచో ఉపవాసముండవచ్చునని అనేవారిని మేము సరియైనవారిగా భావించము.

విడిది చేసినప్పుడు ఉపవాసముల గురించి హ్రజత్ సయ్యద్ ముహమ్మద్ సర్వర్ షాహ్ గారిట్లు తెలిపిరి. ఉపవాసముల గురించి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఎవరైనా ఒక చోట మూడు రోజుల కంటే ఎక్కువ విడిది చేయుచున్నచో ఉపవాసములుండవలెను. 3 రోజుల కంటే తక్కువ యుండదలచినచో ఉపవాసములు వుండకూడదు. ఖాదియాన్‌లో తక్కువ రోజులు యుండదలచినను ఉపవాసములు యున్నచో తరువాత ఉపవాసములు వుండవలసిన అవసరం లేదు. ఎందుకనగా ఖాదియాన్ రెండవ స్వస్థలము. ఇందులో 3 రోజుల కంటే తక్కువ సమయమున్నను ఉపవాసముండదలచినచో యుండవచ్చును. కాని మిగతా ప్రాంతములలో 3 రోజుల కంటే ఎక్కువ యుండదలచినచో మాత్రమే ఉపవాసముండవలెను.

రోగి, ప్రయాణికుడు ఉపవాసముండు ప్రస్తావన హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సమావేశములో వచ్చెను. హ్రజత్ మౌల్వీ నూరుద్దీన్ గారు షేఖ్ అబ్నె అరబీ ఈ వాక్యమును వినిపించిరి. రోగి, ప్రయాణికుడు ఉపవాసముల రోజులలో ఉపవాసముండినను స్వస్థత కలిగినచో రమజాన్ తరువాత మరల ఉపవాసము విధిగా యుండవలెను. ఎందుకనగా అల్లాహ్ తఆలా స్పష్టమైన ఆదేశమిట్లు గలదు. فمن كان منكم مريضا او على سفر فعدة من ايام اُخر- అనగా మీలో ఎవరైనా అనారోగ్యము లేదా ప్రయాణములో యున్నచో రమజాన్ తరువాతి రోజులలో ఉపవాసము యుండవలెను. అతడు తరువాత ఉపవాసముండవలెనని దేవుని స్పష్టమైన ఆదేశము గలదు. మధ్యలోని ఉపవాసములు అతడు యుండినచో ఇది అదనపు విషయము. అతని హృదయ కోరిక. కాని దీనితో తరువాత యుండవలెననే అల్లాహ్ తఆలా ఆదేశమును విస్మరించరాదు. హ్రజత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. రోగి, ప్రయాణికుడైన స్థితిలో ఉపవాసముండు వ్యక్తి అల్లాహ్ తఆలా స్పష్టమైన ఆదేశము పట్ల అవిధేయత వహించువాడగును. రోగి, ప్రయాణికుడు ఉపవాసముండకూడదని అల్లాహ్ తఆలా స్పష్టముగా ఆదేశించెను. వ్యాధి నుండి స్వస్థత పొందిన తరువాత, ప్రయాణము ముగిసిన తరువాత ఉపవాసముండవలెను. దేవుని ఈ ఆదేశమును పాటించవలెను. ఎందుకనగా మోక్షము అనుగ్రహముతో కలుగును. తన కర్మల శక్తితో ఎవరు మోక్షము పొందలేరు. రోగము తక్కువ యున్నదా ఎక్కువ యున్నదా, ప్రయాణము చిన్నదా పెద్దదా అని దేవుడు ప్రస్తావించలేదు. ఇదొక సాధారణ ఆదేశము, కనుక పాటించవలెను. రోగి, ప్రయాణికుడు ఉపవాసముండినచో అవిధేయత నిర్ణయము వెలువడును.

హ్రజత్ సాహిబ్జాద మిర్జా బషీర్ అహ్మద్ గారిట్లు వ్రాసిరి. డా॥ మీర్ ముహమ్మద్ ఇస్మాయీల్ గారిట్లనిరి.

ఒక సారి లుధ్యానాలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రమజాన్ ఉపవాసముండిరి. గుండె నొప్పితో పాటు మోకాలు నొప్పి మొదలయ్యెను. ఒక్కసారిగా కాళ్లు చేతులు చల్లబడి పోయెను. అప్పుడు సూర్యాస్తమయ సమయం అతి దగ్గరలోనే యుండెను. కాని వారు తక్షణమే ఉపవాస దీక్ష విడిచిపెట్టిరి. శాసనములో సులభమైన దారినే వారు సదా పాటించేవారు. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారిట్లనిరి. హదీసులో కూడ హజ్రత్ ఆయిషా ఉల్లేఖనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సదా రెండు ధర్మబద్ధమైన మార్గములలో సులభమైన మార్గమునే అవలంభించేవారని గలదు.

కొన్ని సార్లు వ్యవసాయదారులు విత్తనాలు వేసే, నాటు పెట్టే లేదా పంట కోసే సమయములో రమజాన్ వచ్చును. కూలీ పని చేస్తేనే పూట గడిచే కూలీలు ఉపవాసముండడం కష్టతరమగును. ఇటువంటి కూలీల గురించి గల ఆదేశమేమిటని ప్రశ్న ఉత్పన్నమయ్యెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. الاعمال بالنيات వీరు తమ స్థితులను రహస్యముగా యుంచుదురు. ప్రతి వ్యక్తి నిష్టాపరత, పరిశుద్ధతతో తన స్థితిని గమనించవలెను. ఎవరైనా ఉపవాసముండినను కూలీ చేయగలిగినచో ఉపవాసముండవచ్చును. లేనిచో అతడు రోగిగా పరిగణించబడును. అతనికి అవకాశము లభించినప్పుడు ఉపవాసముండవచ్చును.

ఫిద్యా గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఫిద్యా ఎందుకని నా హృదయములో ఒక సారి ఆలోచన వచ్చెను. ఉపవాస అనుగ్రహము లభించుటకే ఈ ఫిద్యా నిర్ణయించబడెనని నాకు తెలిసినది. దైవ ఉనికియే అనుగ్రహము కలిగించును. ప్రతి వస్తువు దేవున్నే అడగవలెను. దేవుడు సర్వశక్తిమంతుడు. అతడు కోరినచో ఒక బలహీనునికి కూడ ఉపవాస అనుగ్రహము ప్రసాధించును. నా దృష్టిలో ఇలా దుఆ చేయవలెను. దేవుడా! ఇది నీ పవిత్ర మాసము. నేను దీనితో లబ్ది పొందలేక పోవుచున్నాను. వచ్చే సం॥ సజీవముగా యుందునో లేదో తెలియదు. కనుక విడిచి పెట్టిన ఈ ఉపవాసములు యుండగలుగుతానో లేదో. ఇలా అనుగ్రహము పొందవలెను. ఇటువంటి హృదయమునకు అల్లాహ్ తఆలా శక్తి ప్రసాధించునని నాకు నమ్మకము గలదు. ఉపవాసముండలేని వ్యక్తి ఒక నిరుపేదకు భోజనము పెట్టవచ్చునా లేక ఖాదియాన్‌లోని అనాథాశ్రమానికి పంపవచ్చునా? లేదా ఏదేని జమాఅత్ వ్యవస్థకు పంపుట సమసంజసమేనా ? హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఏదైనా ఒకటే. తమ నగరములో అనాథకు భోజనము తినిపించినా లేదా ఏదేని అనాథ, బీదల పథకమునకు పంపవచ్చును. లేదా తనకు తెలిసిన వ్యక్తికి ఉపవాసము విడుచుటకు తినిపించవచ్చును.

తెలియక తినడం, త్రాగడంతో ఉపవాసము భంగము కాదు. ఉపవాసముల మాసములో లోపల కూర్చొని భుజించుచుండగా బయటికి వచ్చి చూడగా వెలుతురు అయినట్లు కనిపించినది. అలాంటప్పుడు ఆ ఉపవాసము మరల వుండుట అనివార్యమా లేదా అని ఒకరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ప్రశ్నించిరి. వారిట్లనిరి. తెలియక తిని, త్రాగినచో మరల ఉపవాసముండుట అనివార్యము కాదు. తెలియక తినినందున ఎలాంటి అభ్యంతరము లేదు.

వయసు విషయము గలదు. ఏ వయసులో ఉపవాసముండవెను, వుండకూడదో చిన్నా పెద్దా అందరడుగురు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లనిరి. చిన్న వయసు గల పిల్లలు ఉపవాసముండకూడదని శాసనము సూచించెను. కాని యవ్వన దశకు చేరుకునే ముందు ఉపవాసములు యుండే అభ్యాసం వారికి తప్పక చేయించవలెను. 12, 13 సం॥ల వయసులో మొదటి ఉపవాసము యుండే అనుమతి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నాకిచ్చినట్లు నాకు గుర్తున్నది. కాని కొందరు అవివేకులు ఆరు ఏడు సం॥ వయసు గల పిల్లలతో ఉపవాసము పెట్టించెదరు. ఇందుకు మాకు పుణ్యము లభించునని భావింతురు. ఇది పుణ్య కార్యము కాదు, దౌర్జన్యము. ఎందుకనగా ఈ వయసు పెరుగుదలకు చెందినది. కాని యవ్వనము కంటే ముందు ఉపవాసములు విధిగావించబడే వయసు కూడ వచ్చును. అప్పుడు ఉపవాసముల అభ్యాసం చేయించవలెను. 18 సం॥ల వయసు వచ్చే వరకు ప్రతి సం॥ కొన్ని ఉపవాసముల అలవాటు చేయవలెను. నా దృష్టిలో ఇది యవ్వన వయసు. మొదటి సం॥ ఒక్క ఉపవాసము మాత్రమే యుండుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నాకు అనుమతినిచ్చిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. 12, 13 సం॥ల వయసులో ఉపవాసమునకు అనుమతి ఇచ్చినప్పుడు ఒక్క ఉపవాసము మాత్రమే వుంచబడిరి. ఇందులో కేవలము ఉత్సాహముండును. ఈ ఉత్సాహము వలన పిల్లలు ఎక్కువ ఉపవాసములుండుటకు ఇష్టపడదురు. కాని వారిని నివారించుట తల్లిదండ్రుల బాధ్యత. తరువాత ఒక వయసులో పిల్లలను ఉపవాసముండుటకు ప్రోత్సహించవలసి వచ్చును. బాల్యములో ఎక్కువ యుండకూడదని తల్లిదండ్రులు నివారించవలెను. అనంతరం యవ్వనములో ఎక్కువ యుండుటకు ప్రోత్సహించవవలెను. అన్ని వుండకుండా గమనించవలెను. చూపరులు కూడ అన్ని ఉపవాసములు ఎందుకు వుండడం లేదని విమర్శించకూడదు. ఎందుకనగా బాలుడు ఈ వయసులో అన్ని ఉపవాసములుండినచో తరువాత ఉపవాసములు వుండలేడు. ఇలాగే కొందరు పిల్లలు పుట్టుకతోనే బలహీనంగా యుంటారు. నేను చూచినాను. భేటి అగుటకు కొందరు నా వద్దకు వచ్చెదరు. ఈ బాలుని వయసు 15 సం॥లు అని అందురు. కాని చూచుటకు వారు 7,8 సం॥ల వయస్కుల వలె యుందురు. నా దృష్టిలో ఇటువంటి పిల్లలు 21 సం॥ల వయసులో యవ్వన వయసునకు చేరుదురు. ఇందుకు విరుద్ధముగా ఒక మంచి బలమైన బాలుడు 15 లేదా 18 సం॥ల వయసులో యవ్వనమునకు చేరును. కాని ఒకరు నా ఈ మాటలను పట్టుకొని 18 సం॥లు యవ్వన వయసని నిర్ణయించుకొన్నచో అతడు నాపై లేదా దేవుని పై దౌర్జన్యము చేయక తన ప్రాణముపైనే దౌర్జన్యము చేయును. ఒక చిన్న వయస్కుడైన బాలుడు ఉపవాసములుండడం లేదని ఎవరైనా అన్నచో వారు తమపై దౌర్జన్యము చేయువారగుదురు.

తరావీహ్ గురించి అక్మల్ గారు గోలేకీ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఇట్లు అడిగిరి. పవిత్ర రమజాన్‌లో రాత్రి లేచి ప్రార్థన చేయు ఆదేశము గలదు. కాని సాధారణముగా కష్ట జీవులు, కూలీ పని చేసుకునేవారు, వ్యవసాయదారులు ఇటువంటి కర్మలు చేయుటకు వెనుకాడుదురు. కనుక రాత్రి చివరలో కాక రాత్రి ఆరంభములో వారికి 11 రకాతులు చదివించినచో సమంజసమేనా ? ఎలాంటి అభ్యంతరము లేదు చదవవచ్చునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సమాధానమిచ్చిరి.

తరావీహ్ తహజ్జుద్‌నకు బదులు అయినప్పుడు 20 రకాతులు చదవడంలో అభ్యంతరమేమిటని ప్రశ్న వచ్చెను. ఇట్లనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శాశ్వత పద్ధతి 8 రకాతులే. వారు తహజ్జుద్ సమయముననే చదివేవారు. ఇదే ఉత్తమమైనది. కాని రాత్రి ఆరంభములో చదువుట కూడ సమంజసమే. తహజ్జుద్ సమయమున 8 రకాతులు చదువుటయే మేలు. కాని రాత్రి అరంభములో చదివినా అభ్యంతరమేమి లేదు. ఒక కథనములో రాత్రి మొదటి భాగములో వారు (స) చదివినట్లు కూడ గలదు. 20 రకాతులు కూడ చదువబడెను. కాని ఇంతకు ముందు ప్రస్తావించినదే శాశ్వత పద్ధతి. ఈ 20 రకాతులు లేదా ఎక్కువ రకాతుల విషయము తరువాతి విషయము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పద్ధతి 8 రకాతుల తహజ్జుదే.

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ ఇట్లనిరి. రమజాన్ గురించి ఈ కొన్ని విషయములుండెను. వీటిని నేను ప్రస్తావించినాను. ధర్మబద్ధతను పాటించుచు, అల్లాహ్ ప్రీతికి ప్రాధాన్యతనిచ్చుచు రమజాన్ ఉపవాసములతో ప్రయోజనము పొందు అనుగ్రహము అల్లాహ్ తఆలా మనకు కలిగించుగాక! (ఆమీన్)

❀❀❀

BOOK POST (PRINTED MATTER)

To,
....
....
....